కొండ ప్రాంతాల్లో త్వరలో ద్విచక్ర అంబులెన్స్ సేవలు

వేలూర్, న్యూస్‌టుడే: కొండ ప్రాంతాల్లో నవంబరు 8వ తేదీ నుంచి ద్విచక్ర అంబులెన్స్ పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి మా.సుబ్రమణియన్ వెల్లడించారు. ఆయన వేలూర్ సమీప గుడియాత్తంలో సోమవారం పలు కార్యక్రమాల్లో పాల్గొని సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. కొండ ప్రాంతాలకు అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, దీంతో ఈ కొత్త పథకానికి శ్రీకారం చుట్టినట్లు వివరించారు. జవ్వాదుమలైలో పథకాన్ని ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. వేలూర్ జిల్లాలో రూ.1. 20 కోట్ల వ్యయంతో 3 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు నిర్మించనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో ఐదారు నెలల్లో 1021 మంది వైద్యులు, 977 మంది నర్సులు, 946 మంది ఫార్మసిస్టులు, 526 మెడికల్ అసిస్టెంట్లను నియమించినట్లు తెలిపారు. వేలూర్ అడుక్కంపారై వైద్య కళాశాలలో నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులు త్వరలో పూర్తి కానున్నాయని పేర్కొన్నారు.

ఆహ్వానించకున్నా టీవీకే మహానాడుకు వెళ్తా: నటుడు విశాల్


చెన్నై, న్యూస్‌టుడే: తమిళగ వెట్రి కళగం(టీవీకే) మహానాడుకు ఆహ్వానించకున్నా వెళతానని నటుడు విశాల్ తెలిపారు. చెన్నైలో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. కొత్త రాజకీయ నాయకులు వస్తున్నారని, ఆయన మాట్లాడే విషయంపై ఓటర్లు ఆసక్తితో ఉన్నారని తెలిపారు. ఆహ్వానించకున్నా వెళ్లి ఒక పక్కన నిల్చుని మహానాడును తిలకిస్తానని పేర్కొన్నారు. సామాజిక సేవ చేసే తానూ ఓ రాజకీయ నాయకుడినే అన్నారు. తమిళగ వెట్రి కళగంలో చేరడంపై ఇంకా ఆలోచించలేదని చెప్పారు. రాబోయే శాసనసభ ఎన్నికల్లో తాను పోటీ చేసే అవకాశం ఉందన్నారు.

చెన్నైలో కార్మిక సంఘాల సమావేశం 26న

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రభుత్వ రవాణా సంస్థల కార్మికుల సమస్యలపై అన్ని సంఘాలు 26న సమావేశమవనున్నాయి. సీఐటీయూ, ఏఐటీయూసీ, టీటీఎస్ఎఫ్ సంఘాలు సంయుక్తంగా విడుదల చేసిన ప్రకటనలో.. రవాణాసంస్థల్లో ప్రస్తుతం పనిచేస్తున్న 1.25 లక్షల మంది, పదవీ విరమణ పొందిన 95వేల మంది కార్మికులు ఉన్నారన్నారు. పరిశ్రమ ప్రైవేటీకరణకు పరిశ్రమ చర్యలు, 25వేల ఖాళీ పోస్టులు భర్తీ చేయకుండా కాంట్రాక్టు పద్ధతిలో నియామకం, జీతాలు, పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించపోవడం తదితర సమస్యలు ఎదుర్కొంటున్నట్లు పేర్కొన్నారు. పరిష్కారానికి 26న చెన్నై ఎగ్మూర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నామన్నారు.

పోలీసు అమరవీరులకు నివాళులు

ప్యారిస్, చెన్నై, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా సోమవారం డీజీపీ శంకర్ జివాల్ నివాళులు అర్పించారు. గత ఏడాది విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన తమిళనాడు పోలీసుశాఖకు చెందిన ప్రత్యేక సబ్ఇన్‌స్పెక్టర్ పుష్పరాజ్, హెడ్‌కానిస్టేబుల్ కుమరన్, గ్రేడ్ వన్ పోలీసు కార్తికేయన్, విఘ్నేష్, కానిస్టేబుల్ జేసు ఆల్విన్ తదితరులకు డీజీపీ కార్యాలయంలోని పోలీసు స్మారక చిహ్నం వద్ద నివాళులు అర్పించి వారి త్యాగాన్ని గుర్తు చేశారు. చెన్నై కమిషనర్ అరుణ్ తదితరులు కూడా నివాళులర్పించారు. ● సంస్మరణ దినంలో వీరవందనం చెల్లిద్దామని ముఖ్యమంత్రి స్టాలిన్ పిలుపునిచ్చారు. సామాజిక మాధ్యమాల్లో ఆయన చేసిన పోస్టులో.. దేశ సరిహద్దులను మిలటరీ సైనికులు కాపాడేలా మన ఇళ్లను పోలీసుశాఖ కాపాడుతోందన్నారు. కర్తవ్యాన్ని నెరవేర్చేటప్పుడు పలువురు ప్రాణత్యాగం చేశారని, అలాంటి వారి త్యాగాన్ని కీర్తిద్దామన్నారు.



పోలీసు స్మారక చిహ్నం వద్ద పుష్పగుచ్ఛం పెడుతున్న డీజీపీ శంకర్‌జివాల్





పోలీసు దుస్తులతో తాతకు నివాళులర్పిస్తున్న ఎనిమిదేళ్ల తరుణ్ ● నివాళులర్పిస్తున్న పోలీసులు

దిగ్గజ దేశానికి దీటుగా!

చైనాకు ప్రత్యామ్నాయంగా తమిళనాడు ప్రణాళికలు
కీలక రంగాలపైనే గురి
తయారీ రంగంలో మరిన్ని పరిశ్రమలు రాక

ఈనాడు-చెన్నై

కొన్ని రంగాల్లో చైనాకు ప్రపంచంలోనే తిరుగులేదు. అంతటి తయారీ సామర్థ్యం, సాంకేతికత, నైపుణ్యత అక్కడున్నాయి. ఆ దేశానికి ప్రత్యామ్నాయంగా ఉండేలా తమిళనాడును ముందుకు తీసుకెళ్లేలా వ్యూహాలు నడుస్తున్నాయి. చాలా పరిశ్రమలు ఇటువైపు వచ్చేలా మంతనాలు సాగుతున్నాయి. ఈ క్రతువులో ఇప్పటికే కొంత విజయం సాధించామని అంటోంది ప్రభుత్వం.

సిస్కో వేగం..

సిస్కో ఎలక్ట్రానిక్స్ సంస్థ ప్రత్యేక లక్ష్యాలతో తమిళనాడుకు వస్తున్నట్లు పరిశ్రమలశాఖ చెబుతోంది. సర్వర్లు, మెమొరీ ర్యామ్‌లు, రూటర్ల తయారీ భారీఎత్తున చేపట్టే ఆలోచనలున్నాయి. ఇది తమిళనాడుకెంతో మేలు చేస్తుందని వెల్లడిస్తున్నారు. రాష్ట్రంలో తయారయ్యే మొబైల్ విడిభాగాలతో పోల్చితే.. తాజాగా సిస్కో ప్రణాళిక దాన్ని మించిపోతుందని ప్రభుత్వం చెబుతోంది. తద్వారా ఎలక్ట్రానిక్స్ రంగంపై పెద్ద ఆశలే పెట్టుకున్నట్లు కనిపిస్తోంది.



ఎగుమతుల్లో మెరుగ్గా..

ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్‌లో తాజా గణాంకాలు తీసుకుంటే 2021లో ఎగుమతులు 1.26 బిలియన్ డాలర్లుండగా.. ఇప్పుడు 10 బిలియన్ డాలర్లకు పెరిగాయని అధికారులు చెబుతున్నారు. కేవలం మూడేళ్లలో ఈ ప్రగతి రావడాన్ని గమనించాలంటున్నారు. మొబైల్ విడిభాగాల తయారీలో తమిళనాడు దూసుకుపోతున్న తీరును చైనా మీడియా సైతం ప్రత్యేకంగా గమనిస్తోందని 'గైడెన్స్ తమిళనాడు' శాఖ అధికారులు వివరిస్తున్నారు. మరీ ముఖ్యంగా ఒక్క ఫాక్స్‌కాన్ కంపెనీలోనే ఏకంగా 40వేల మంది ఉద్యోగులు పనిచేస్తున్న విషయాన్ని గుర్తుచేశారు. ఇవన్నీ చైనాకు ప్రత్యామ్నాయంగా చూపొచ్చని వారంటున్నారు.



బూట్ల తయారీలోనూ దూకుడు



బూట్ల తయారీలోనూ తమిళనాడు తిరుగులేకుండా వెళ్తోందని అధికారులు వివరిస్తున్నారు. ప్రత్యేకించి తైవాన్, తూర్పు ఆసియా దేశాలను మించిపోయేలా నాన్ లెదర్ బూట్ల తయారీలో రాష్ట్రం ముందుండేలా ప్రణాళికలున్నాయని తెలిపారు. ఇప్పటికే 3 తైవాన్ సంస్థలు రాష్ట్రానికి వచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయని, వాటిద్వారా రూ. 5వేల కోట్ల పెట్టుబడులు సమకూరుతాయని అంటున్నారు. పౌచెన్ నుంచి రూ. 2,300 కోట్లు, హాన్‌ఫు నుంచి రూ. 1,500కోట్లు, డీన్ షూస్ నుంచి రూ. 1000కోట్లు వస్తున్నట్లు వివరించారు. పలు జపాన్ సంస్థలూ వస్తున్నాయని ప్రకటించారు. రమ టెక్స్ సంస్థ రూ. 1100 కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చింది. వస్త్ర రంగంలోనూ ఇదే తరహా వ్యూహం కనిపిస్తోంది.

ఆకర్షిస్తున్నాం..



తమిళనాడు కచ్చితంగా చైనాకు ప్రత్యామ్నాయం అవుతుంది. ఎందుకంటే.. పరిశ్రమలకు అనువైన వాతావరణం ఇక్కడుంది. కంపెనీలు పెద్దఎత్తున వచ్చేలా రంగాలవారీగా పాలసీలు విడుదలచేశాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్, సమస్యల పరిష్కారానికి ఏకగవాక్ష విధానం ఆకట్టుకుంటున్నాయి. హోసూరు, రాణిపేట, తూత్తుకుడి ప్రాంతాల్ని పారిశ్రామిక క్లస్టర్లుగా విభజించి ప్రత్యేక దృష్టి సారిస్తున్నాం. విదేశీ సంస్థలను ఇలాంటివన్నీ ఆకర్షిస్తున్నాయి.

– టీఆర్బీ రాజా, పరిశ్రమలశాఖ మంత్రి



తయారీ రంగంలో చైనాకు దీటుగా తమిళనాడు ఎదుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటిస్తోంది. ముమ్ముందు మరిన్ని వ్యూహాలు చూస్తారని కూడా చెబుతోంది. ప్రత్యేకించి ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్స్, విద్యుత్తు వాహనాలు, విడిభాగాలు తదితరాల్లో బలవంతమైన రాష్ట్రంగా ఎదగాలని చూస్తోంది. ఇందులో అనుసరిస్తున్న ప్రధాన వ్యూహం.. దేశానికి ఇదివరకు రాని కీలక కంపెనీలతో చర్చలు జరుపుతోంది. అగ్రగామిగా ఉన్న చైనాను ఎలా అధిగమించాలనే లక్ష్యంతో ఇది కూడా ఎత్తుగడగా ఉంది.

ఎలక్ట్రానిక్స్‌లో కీలక సంస్థలు

ప్రభుత్వం చెబుతున్న వివరాల ప్రకారం.. తాజాగా రాష్ట్రానికి వచ్చిన కొన్ని కంపెనీలే తమిళనాడు చైనాకు దీటుగా వెళ్తోందని చెప్పడానికి సాక్ష్యంగా వెల్లడిస్తున్నారు. విన్‌ఫాస్ట్, టాటా జేఎల్ఆర్, టాటా ఎలక్ట్రానిక్స్, జబిల్, సిస్కో, హంగ్‌ఫు, పౌచెన్‌లాంటి దిగ్గజ కంపెనీలు ఇప్పుడు రాష్ట్రానికి వచ్చాయి. ఆయా సంస్థల్లో తయారయ్యే ఉత్పత్తులు తమిళనాడు పురోగతిని మరింతగా పెంచున్నాయని సర్కారు అంటోంది. తాజా గణాంకాల్ని చూస్తే.. హ్యుందాయ్ మోటార్స్ నుంచి రూ. 20వేల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నట్లు ప్రకటించాయి. ఇదే తరహాలో టాటా మోటార్స్ నుంచి రూ. 9వేలకోట్ల పెట్టుబడులు సమకూరనున్నాయి. విద్యుత్తు తయారీ సంస్థలు విస్ట్రాన్, ఈటోన్, జెడ్ఎఫ్, ఆటోడెస్క్‌లాంటి ప్రముఖ సంస్థలు వస్తున్నాయని వివరించారు.

టాస్మాక్ ఉద్యోగులకు దీపావళి బోనస్ ప్రకటన

ప్యారిస్, న్యూస్‌టుడే: టాస్మాక్ ఉద్యోగులకు ప్రభుత్వం దీపావళి బోనస్ ప్రకటించింది. గ్రూప్-సీ, డీ విభాగ సిబ్బంది, సూపర్‌వైజర్లు, డీలర్లు తదితరులకు 20 శాతం బోనస్ అందించనున్నట్లు వెల్లడించింది. ఆ మేరకు రూ. 16,800 అందనుంది.

పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశం

ప్యారిస్, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో భారీవర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ పరిశోధన కేంద్రం ప్రకటనలో తెలిపింది. మంగళవారం రాష్ట్రంలో అనేకచోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది. తిరుప్పూరు, ఈరోడు, నీలగిరి, కోయంబత్తూరు, తేని, దిండుక్కల్, మదురై, కరూర్, తిరుచ్చి జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల, 23న తంజావూరు, పుదుక్కోట్టై, శివగంగై, మదురై, తేని, దిండుక్కల్ జిల్లాల్లో ఒకటి, రెండు చోట్ల భారీవర్షానికి అవకాశం ఉన్నట్లు పేర్కొంది. 24, 25న రాష్ట్రంలో కొన్ని చోట్ల, పుదుచ్చేరి, కారైక్కల్‌లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని తెలిపింది. రాబోయే 48 గంటలపాటు చెన్నైలో ఆకాశం మేఘావృతమై ఉంటుందని, కొన్ని చోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

శివకాశిలో పెరిగిన బాణసంచా విక్రయాలు

ప్యారిస్, న్యూస్‌టుడే: దీపావళి దగ్గర పడుతుండటంతో టపాసులు కొనేందుకు శివకాశికి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ఇక్కడ 2,500కి పైగా దుకాణాల్లో టపాసులు విక్రయిస్తున్నారు. తిరుత్తంగల్, సాత్తూర్, విరుదునగర్ సాలై తదితర ప్రాంతాల్లోనూ పెద్దసంఖ్యలో దుకాణాలు ఉన్నాయి. ధరలు తక్కువగా ఉంటాయని రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తున్నారు. దుకాణాల్లో 500కి పైగా రకాలు అందుబాటులో ఉన్నాయి. ఏటా వివిధ రకాల ఫ్యాన్సీ టపాసులు పరిచయం చేస్తున్నారు. బాణసంచా వ్యాపారి మాట్లాడుతూ.. తొలుత ఆర్డర్లు తక్కువగా ఉన్నా నవరాత్రి వేడుకల తర్వాత పెరిగాయన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి సైతం తరలివస్తున్నారని చేస్తున్నారని తెలిపారు. దీపావళికి పదిరోజులు మాత్రమే ఉండటంతో విక్రయాలు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు.



శివకాశిలోని ఓ దుకాణంలో కొనుగోలుదారులు

దీపావళి బహుమతి పెట్టె విక్రయాలు ప్రారంభం

సైదాపేట, న్యూస్‌టుడే: దీపావళి బహుమతి పెట్టె విక్రయాలు ప్రారంభమయ్యాయి. తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ కింద పనిచేసే స్వయం సహాయ బృందాలు తయారు చేసే వస్తువులను పండుగలకు విక్రయిస్తుంటారు. ఆమేరకు ప్రస్తుతం పలు తినుబండారాలతో దీపావళి బహుమతి పెట్టెల విక్రయం ప్రారంభమైంది. 23వ తేదీ వరకు ఈ విక్రయాలు జరగనున్నాయి. కావాలనుకునేవారు www.tncdw.org వెబ్‌సైట్‌లోగాని లేదా 76038 99270 సెల్‌ఫోన్ నెంబర్‌పై సంప్రదించాలని సంబంధిత అధికారులు తెలిపారు.

తిరుమావళవన్‌ని ఎప్పటికైనా ముఖ్యమంత్రిని చేస్తాం: సీమాన్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్‌ను ఎప్పటికైనా ముఖ్యమంత్రిని చేస్తామని నామ్ తమిళర్ కట్చి ప్రధాన సమన్వయకర్త సీమాన్ పేర్కొన్నారు. ఆదివారం నామక్కల్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తిరుమావళవన్‌కు ముఖ్యమంత్రి అయ్యే అర్హత ఉందన్నారు. ఆయన సీఎం అయితే తనకన్నా గర్వంగా, సంతోషంగా ఉండేవారు ఎవరూ లేరన్నారు. కేంద్ర సహాయ మంత్రి ఎల్. మురుగన్ రెండుసార్లు కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు తిరుమావళవన్ ముఖ్యమంత్రి కాకూడదా అని ప్రశ్నించారు. అంతర్గత రిజర్వేషన్లపై కేసు పెడితే ముఖ్యమంత్రి కావడానికి ఆటంకమవుతుందా? అని నిలదీశారు. తాము రిజర్వేషన్‌కి మద్దతు ఇస్తున్నామని, అదే సమయంలో అంతర్గత రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. తిరుమాను ఎప్పటికైనా ముఖ్యమంత్రిని చేస్తామని ధీమా వ్యక్తం చేశారు.

బస చేసిన హోటల్ వద్ద ఉద్రిక్తత

విల్లివాక్కం: వెణ్ణైకోవిల్ ఆలయ భూముల వివాదానికి సంబంధించి బాధితులతో మాట్లాడటానికి సీమాన్ కరూర్ చేరుకొని ఓ హోటల్‌లో బస చేస్తున్నారు. ఈ నేపథ్యంలో హోటల్ ఎదుట పోలీసులు సోమవారం హఠాత్తుగా మోహరించారు. సమాచారం అందిన వెంటనే ఎన్టీకే నిర్వాహకులు హోటల్ వద్దకు వచ్చి పోలీసులతో వాగ్వాదానికి దిగారు. పోలీసులు వారిని అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. దీంతో నిర్వాహకులను అరెస్టు చేశారు. కరూర్ జిల్లా వెణ్ణైమలైలోని బాలసుబ్రహ్మణ్యస్వామి ఆలయ చుట్టుపక్కల వందలాది ఎకరాల భూములు ఆలయానికి సొంతమైనవని, వాటిని స్వాధీనం చేసుకోవడానికి దేవాదాయశాఖ చర్యలు చేపడుతోంది. ఇందుకు సంబంధించి అధికారులు గత నెలలో ఇళ్లు, దుకాణాలకు సీలు వేసే పనులలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో బాధిత ప్రజలు, వ్యాపారులతో మాట్లాడటానికి సీమాన్ కరూర్ చేరుకున్నారు.

అన్ని నియోజకవర్గాల్లోనూ కార్మిక సంఘాలు: ఎంఎన్ఎం తీర్మానం

చెన్నై, న్యూస్‌టుడే: రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లోనూ కార్మిక సంఘాలు ఏర్పాటు చేయాలని మక్కళ్ నీది మయ్యం నమ్మవర్ కార్మిక సంఘం మహాసభ సమావేశం తీర్మానించింది. కార్మిక సంఘం మహాసభ 4వ వార్షిక సర్వసభ్య సమావేశం, మహాసభ ఐదో ఏడాది ప్రారంభోత్సవం, మహాసభ కొత్త కార్యాలయం ప్రారంభోత్సవం త్రైమహోత్సవంగా ఆళ్వార్‌పేటలోని పార్టీ ప్రధాన కార్యాలయంలో జరిగింది. కార్మిక సంఘం మహాసభ కొత్త కార్యాలయాన్ని పార్టీ ప్రధాన కార్యదర్శి అరుణాచలం ప్రారంభించారు. అనంతరం జరిగిన సర్వసభ్య సమావేశంలో... పార్టీ అధ్యక్షుడు కమలహాసన్ సూచనలు మేరకు రాష్ట్రంలోని 234 శాసనసభ నియోజకవర్గాల్లోనూ కార్మిక సంఘాలు ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో శాఖల వారీగా ప్రారంభించాలని, అసంఘటితరంగ కార్మికులకు హక్కులు, రాయితీలను అందించడం, పెరంబూర్‌లోని ఐసీఎఫ్ ఒప్పంద కార్మికులకు బదులు పర్మినెంట్ ఉద్యోగులను నియమించాలని రైల్వేశాఖను డిమాండ్ చేస్తూ, నవంబరు 7న కమలహాసన్ జన్మదినాన్ని రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని పలు తీర్మానాలు చేశారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ నిర్వాహకులు

నటి గౌతమికి అన్నాడీఎంకేలో కీలక పదవి



సైదాపేట, న్యూస్‌టుడే: ప్రముఖ సీనియర్ నటి గౌతమికి అన్నాడీఎంకేలో కీలక పదవి దక్కింది. గౌతమి ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికలకు ముందు భాజపా నుంచి వైదొలిగి అన్నాడీఎంకేలో చేరారు. ఎన్నికల్లో అన్నాడీఎంకే అభ్యర్థుల తరఫున ప్రచారం కూడా చేశారు. ఈ నేపథ్యంలో పార్టీ ఉప ప్రచార కార్యదర్శిగా ఆమెను నియమిస్తూ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిసామి సోమవారం ప్రకటించారు. అలాగే ఎంజీఆర్ మండ్ర ఉప కార్యదర్శిగా పెరియసామి, మైనారిటీ సంక్షేమ విభాగ ఉప కార్యదర్శిగా ఫాతిమా అలీ, వ్యవసాయ విభాగ ఉప కార్యదర్శిగా సన్యాసి నియమితులయ్యారు.



డీఎంకే ప్రధాన కార్యాలయమైన అన్నా అరివాలయంలో 'మురసొలి' దినపత్రిక మాజీ సంపాదకుడు సెల్వం చిత్రపటాన్ని ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో సోమవారం ద్రావిడర్ కళగం అధ్యక్షుడు వీరమణి ఆవిష్కరించారు. వెంట మంత్రి దురైమురుగన్, హిందూ గ్రూపు సంచాలకులు ఎన్.రామ్, సినీ నటుడు సత్యరాజ్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి తదితరులు ఉన్నారు.

– న్యూస్‌టుడే, చెన్నై

ద్రావిడాన్ని తొలగించలేరు: ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి



మాట్లాడుతున్న ఉదయనిధి

ఆర్కేనగర్: డీఎంకేలో చివరి కార్యకర్త ఉన్నంతవరకు తమిళాన్ని, తమిళనాడును, ద్రావిడాన్ని తాకలేరని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధిస్టాలిన్ తెలిపారు. దిండుక్కల్ జిల్లా నత్తంలో మాజీ ఎమ్మెల్యే ఆండి అంబలం ఇంటి వివాహ వేడుక సోమవారం జరిగింది. ఉదయనిధి, మంత్రులు పెరియస్వామి, చక్రపాణి, మూర్తి తదితరులు పాల్గొన్నారు. వధూవరులను ఆశీర్వదించిన అనంతరం ఉదయనిధి మాట్లాడుతూ.. పెరియార్, అన్నా, కరుణానిధి మహిళా అభివృద్ధికి పాటుపడ్డారని చెప్పారు. వారి మార్గంలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ పయనిస్తున్నారని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటివరకు 530 కోట్ల సార్లు మహిళలు ప్రభుత్వం బస్సులో ప్రయాణించారని చెప్పారు. అన్నా పెట్టిన తమిళనాడు అనే పేరును ఒకరు మార్చాలని చూశారని, తర్వాత ప్రజల వ్యతిరేకతతో వారే క్షమాపణ చెప్పారన్నారు. ఇప్పుడు తమిళ్‌తల్లి ప్రార్థనాగీతంలోని ద్రావిడాన్ని తొలగించాలని కొందరు అంటున్నారని, అది ఎట్టి పరిస్థితుల్లోనూ సాధ్యంకాదనే విషయాన్ని గుర్తించాలన్నారు.



పెళ్లి జంటలు



నూతన దంపతులకు అందించే కానుకలు

3 ఏళ్లలో 2,226 ఆలయాల పునరుద్ధరణ

ముఖ్యమంత్రి స్టాలిన్



సీఎం సమక్షంలో మంగళసూత్రం కడుతున్న వరుడు

చెన్నై, న్యూస్‌టుడే: అన్ని శాఖలకు డీఎంకే ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. ఆర్థికంగా వెనకబడిన 700 జంటలకు ఆలయాల తరఫున 4 గ్రాముల బంగారు తాళి సరుడు సహా రూ. 60 వేల విలువైన కానుకలు అందించి పెళ్లి జరిపించనున్నట్లు 2024-25 ఆర్థిక సంవత్సరం హిందూ దేవాదాయ, ధర్మాదాయశాఖ పద్దుల్లో ప్రకటించారు. ఆ మేరకు తొలి విడతగా చెన్నై జిల్లా ఆలయాల తరఫున 31 జంటలకు తిరువాన్మియూర్‌లోని మరుందీశ్వరర్ ఆలయ కల్యాణ మండపంలో సోమవారం సామూహిక వివాహాలు జరిపించారు. స్టాలిన్ వధూవరులను ఆశీర్వదించి కానుకలు అందించారు. ఇదేరోజు రాష్ట్రవ్యాప్తంగా 379 జంటలకు పెళ్లిళ్లు జరిపించారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. మూడేళ్లలో 2,226 ఆలయాలను పునరుద్ధరించి కుంభాభిషేకం జరిపించినట్లు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 10,208 ఆలయాల్లో జీర్ణోద్ధరణ పనులకు అనుమతిచ్చినట్లు, ఆలయాలకు చెందిన 7వేల ఎకరాల భూములను ఆక్రమణలు నుంచి స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దాతలు అందించిన రూ. 1,103 కోట్ల నిధులు ద్వారా ఆలయాల్లో 9,123 పనులు జరిగాయని, తొమ్మిందిట్లో అన్నదాన పథకాన్ని విస్తరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్ముడి, సుబ్రమణియన్, పీకే శేఖర్‌బాబు, శ్రీపెరుంబుదూర్ ఉలగారియ రామానుజ ఎంబార్ జీయర్ స్వాములు, తొండై మండల ఆధీనం తవతిరు చిదంబరనాథ జ్ఞానప్రకాశ దేశిక పరమాచార్య స్వాములు, మహానగర చెన్నై కార్పొరేషన్ మేయర్ ప్రియ, ఎంపీ తమిళచ్చి తంగపాండియన్, ఎమ్మెల్యేలు, పర్యాటక, సాంస్కృతిక, ధర్మాదాయశాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ చంద్రమోహన్, హిందూ దేవాదాయ, ధర్మాదాయశాఖ కమిషనరు శ్రీధర్, అదనపు కమిషనరు డాక్టర్ సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో పోలీసులతో అసభ్యకరంగా మాట్లాడిన జంట

వీడియో వైరల్

ప్యారిస్, న్యూస్‌టుడే: మద్యం మత్తులో ఓ జంట పోలీసులతో అసభ్యకరంగా మాట్లాడిన వీడియో వైరల్‌గా మారింది. చెన్నై మెరీనా లూప్‌రోడ్‌లో ఆదివారం అర్ధరాత్రి విధుల్లో ఉన్న పోలీసులతో ఓ జంట అనుచితంగా మాట్లాడారు. అరెస్టు చేస్తామని పోలీసులు హెచ్చరించినా వినకుండా ఉదయనిధి స్టాలిన్‌ను ఇప్పుడే పిలుస్తా.. చూస్తారా అంటూ ఆ ఉప ముఖ్యమంత్రి పేరు చెప్పి బెదిరించారు. పోలీసులను దుర్భాషలాడారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో వారిద్దరు భార్యాభర్తలు కాదని తెలిసినట్లు సమాచారం. ఈ జంట పరారై వేళచ్చేరిలోని ఓ హోటల్లో ఉన్నట్లు తెలిసింది. మైలాపూర్ పోలీసులు వారిని అరెస్టు చేశారు.

జేకేఎన్‌సీ అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు

చెన్నై, న్యూస్‌టుడే: జమ్మూ కశ్మీర్ నేషనల్ కాన్ఫరెన్స్(జేకేఎన్‌సీ) అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా జన్మదినం సందర్భంగా ఆయనకు ముఖ్యమంత్రి స్టాలిన్ 'ఎక్స్' పేజీలో శుభాకాంక్షలు తెలిపారు. కశ్మీర్ హక్కులు, గౌరవం కోసం అలుపెరుగని పోరాటం చేసిన ఫరూక్ అబ్దుల్లా పోరాట పఠిమకు అభివాదం చేస్తున్నట్లు తెలిపారు. ఆయన సుదీర్ఘకాలం మానసిక ప్రశాంతతో జీవించాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయన గళం ప్రజా కాంక్షకు ప్రేరణను కొనసాగించాలన్నారు. డీఎంకే, జేకేఎన్‌సీ మధ్య సిద్ధాంతపరమైన సంబంధం అన్నాదురై కాలం నుంచి ఇప్పటివరకు కొనసాగుతోందని తెలిపారు. ప్రజాస్వామ్య నైతిక విలువలను కాపాడటంలో ఈ పార్టీలు బలోపేతంగా ఉన్నాయని పేర్కొన్నారు.

ఎన్టీకే నుంచి వైదొలగిన జిల్లా కార్యదర్శి

వేళచ్చేరి, న్యూస్‌టుడే: నామ్ తమిళర్ కట్చి(ఎన్టీకే) నుంచి పలువురు నిర్వాహకులు, కార్యకర్తలు ఇటీవల పార్టీ నుంచి వైదొలుగుతున్నారు. కొద్దిరోజుల కిందట కృష్ణగిరి జిల్లా నిర్వాహకుడు ప్రభాకరన్ నేతృత్వంలో అనేక మంది కార్యకర్తలు పార్టీకి రాజీనామా చేశారు. విళుపురం పశ్చిమజిల్లా కార్యదర్శి భూపాలన్ రాజీనామా చేసినట్లు సోమవారం ప్రకటించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ప్రధాన సమన్వయకర్త సీమాన్ తీరు నచ్చకే వైదొలగినట్లు తెలిపారు. విళుపురం సెంట్రల్ జిల్లా కార్యదర్శి మణిగండన్ కూడా రాజీనామా చేయనున్నట్లు పేర్కొన్నారు.


సీమాన్‌తో భూపాలన్


పార్కు స్టేషను వద్ద జరుగుతున్న ట్రాక్ నిర్మాణ పనులు

బీచ్ నుంచి ఎమ్మార్టీఎస్ సేవలు పునఃప్రారంభం

నవంబరులో నడిపేందుకు దక్షిణ రైల్వే సన్నాహాలు

- న్యూస్‌టుడే, వడపళని

చెన్నై నగరంలో బీచ్ స్టేషను నుంచి వేళచ్చేరి వరకు 'మాస్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్' (ఎమ్మార్టీఎస్) రైళ్లు నడిచేవి. బీచ్ నుంచి ఎగ్మూరు స్టేషను వరకు నాలుగో లైను నిర్మాణం కారణంగా గత ఏడాది ఆగస్టులో ఎమ్మార్టీఎస్ రైళ్లు చింతాద్రిపేట నుంచి నడిచేవి. పనులు తుది దశకు చేరుకుంటుండటంతో నవంబరు మొదటి వారం నుంచి బీచ్ నుంచి సేవలు ప్రారంభించేందుకు దక్షిణ రైల్వే ఆలోచనలో ఉంది. బీచ్ స్టేషను నుంచి ఎగ్మూరు వరకు జరుగుతున్న పనుల గురించి దక్షిణ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి ఎం.సెందిల్ సెల్వన్ మాట్లాడుతూ.. పనులు తుది దశకు చేరుకుంటున్నాయని, ప్లాట్‌ఫాం, వైండింగ్ దారి వంటి పనులు పార్కు, పోర్టు స్టేషన్లలో జరగాల్సి ఉందని, కావున నవంబరు మొదటి వారంలో బీచ్ నుంచి ప్రారంభించాలనుకుంటున్నామని పేర్కొన్నారు.

■ నిత్య ప్రయాణికుల అవస్థ

చింతాద్రిపేట నుంచి ఎమ్మార్టీఎస్ రైళ్లు నడుస్తుండటంతో నిత్యం అరక్కోణం, తిరువళ్లూరు, గుమ్మిడిపూండి తదితర దూర ప్రాంతాలనుంచి వచ్చే ఉద్యోగులు, కళాశాల విద్యార్థులు, చిరు వ్యాపారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బీచ్ నుంచి ఎగ్మూరు వరకు జరుగుతున్న నాలుగో లైను నిర్మాణంలో కొంత స్థలం నావికాదళం నుంచి దక్షిణ రైల్వేకు అందాల్సి ఉంది. ఈ స్థలం తమ చేతికందనందున కొంత సమయం జాప్యం జరిగిందని దక్షిణ రైల్వే అధికారులు ఆగస్టులో కారణాలను వివరించారు. ప్రస్తుతం అన్ని సమస్యలు పరిష్కారమయ్యాయని, పనులు వేగం పుంజుకున్నాయని చెబుతున్నారు.

● బీచ్, ఎగ్మూరు స్టేషన్ల మధ్య సరుకు రవాణా, రైళ్ల సంఖ్యను పెంచేందుకు నాలుగో లైను నిర్మాణం జరపాలన్నది దక్షిణ రైల్వే గత కొన్నేళ్లుగా ప్రతిపాదనలు చేస్తూ వస్తోంది. ఎట్టకేలకు గత ఆగస్టులో పనులకు ఆటంకాలు తొలగాయి. రూ.274 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించారు. నాలుగో లైను అందుబాటులోకి వచ్చిన తర్వాత ఎగ్మూరు, తాంబరం నుంచి దూర ప్రాంతాలకు మరికొన్ని రైళ్లు నడుస్తాయని అధికారులంటున్నారు.

తమిళతల్లి గీతం గొప్పదనం సీమాన్‌కు తెలియదు

మంత్రి శివశంకర్

వేళచ్చేరి, న్యూస్‌టుడే: ఎన్టీకే ప్రధాన సమన్వయకర్త సీమాన్ నకిలీ రాజకీయ నాయకుడని రవాణా శాఖ మంత్రి ఎస్.ఎస్. శివశంకర్ ఆరోపించారు. అరియలూర్ జిల్లా సెందురైలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన విలేకరులతో మాట్లాడారు. మొబైల్ యాప్ ద్వారా దేశవ్యాప్తంగా ప్రైవేట్ యాజమాన్యం ద్విచక్ర వాహనాలు అద్దెకు నడుపుతోందన్నారు. ఈ వాహనాలతో రాష్ట్రంలో అరక్షిత పరిస్థితి నెలకొంటుందని పలువురు చెబుతున్నారని, అధికారుల కమిటీని ఏర్పాటు చేసి పరిశీలిస్తామన్నారు. వరద నియంత్రణ పనులను ప్రభుత్వం బాగా చేపడుతున్నా ప్రతిపక్షంలోని వారు అవాస్తులు మాట్లాడుతున్నారని విమర్శించారు. తమిళతల్లి గీతాలాపనపై సీమాన్ చేసిన వ్యాఖ్యల గురించి అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానమిస్తూ.. తమిళ తల్లి గీతం మనోన్మణి సుందరనార్ కాలంలో ఆలపించినదని, రాష్ట్ర ప్రభుత్వం అధికారిక గీతంగా ప్రకటించి ఆచరణలో పెట్టిందని గుర్తు చేశారు. ఈ గీతం గొప్పదనం సీమాన్‌కు తెలియదన్నారు.

మళ్లీ వివాదంలో చిక్కుకున్న యూట్యూబర్ ఇర్ఫాన్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: ప్రముఖ యూట్యూబర్ ఇర్ఫాన్ మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఆయనకు గ్రామీణ సంక్షేమ పనులశాఖ నోటీసులు పంపింది. 'ఇర్ఫాన్ వ్యూస్' పేరిట ఇర్ఫాన్ హోటళ్లలోని ఆహార పదార్థాల రుచులు తెలియజేస్తూ, సెలబ్రిటీలతో ఇంటర్వ్యూలు చేస్తుంటాడు. ఇతనికి గతేడాది వివాహమైంది. ఆమె గర్భం దాల్చినప్పుడు దుబాయిలో తీసిన స్కాన్‌లో ఆడబిడ్డ పుట్టబోతుందని ప్రకటించాడు. లింగనిర్ధారణ చట్టప్రకారం నేరం కావడంతో అతనిపై కేసు నమోదు చేశారు. అనంతరం క్షమాపణ చెప్పడంతో చర్యలు నిలిపివేశారు. భార్యకు నెలలకు నిండి ప్రసవ సమయంలో ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లి బిడ్డ బొడ్డు తాడును ఇర్ఫాన్ కట్ చేసే వీడియోను ఇటీవల యూట్యూబ్‌లో విడుదల చేయడంతో చర్చనీయాంశంగా మారింది. ఇందుకు సంబంధించి వివరణ కోరుతూ ఇర్ఫాన్‌కు రాష్ట్ర గ్రామీణ సంక్షేమపనులశాఖ డైరెక్టర్ రాజమూర్తి నోటీసులు పంపారు. తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తమిళనాడు వైద్య చట్టం ప్రకారం ఇది తప్పు అంటూ వైద్యులు కూడా ఖండిస్తున్నారు.


బొడ్డుతాడు కట్ చేస్తున్న ఇర్ఫాన్

ఎల్ఎల్‌బీ కోర్సుకు అంబేద్కర్ లా వర్సిటీ దరఖాస్తుల ఆహ్వానం

వడపళని, న్యూస్‌టుడే: ఎల్ఎల్‌బీ మూడేళ్ల డిగ్రీ కోర్సుకు 'ది తమిళనాడు డాక్టర్ అంబేద్కర్ లా యూనివర్సిటీ' దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు ఒరిజినల్ మార్కులున్న ధ్రువపత్రాలతో అక్టోబరు 23వ తేదీ సాయంత్రం 5.45 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాలని వర్సిటీ రిజిస్ట్రార్ ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తుల పరిశీలన 23 వరకు జరుగుతుంది. ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాలు 26న తెలియజేస్తారు. అక్టోబరు 28 నుంచి 30లోపు అభ్యర్థులు కోర్సులో చేరాలి. వెనుకబడిన తరగతులు(ఇతరులు) 3yearbcbcm@tndaluadmission.com, బాగా వెనుకబడిన వారు 3yearmbc@tndaluadmission.com, ఎస్సీ, ఎస్టీలు 3yearscst@tndaluadmission.com మెయిల్ ఐడీకి దరఖాస్తులు చేసుకోవాలని ప్రకటన పేర్కొంది.


కార్యక్రమంలో డైరెక్టర్ వి.కామకోటి, ప్రతినిధులు

ఐఐటీఎంలో అంతర్జాతీయ సదస్సు

వడపళని, న్యూస్‌టుడే: 'ఎక్స్‌పెరిమెంటల్ మెకానిక్స్-2024' అంశంపై ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, మద్రాస్ (ఐఐటీఎం)లో నాలుగు రోజుల అంతర్జాతీయ సదస్సు ఆదివారం ప్రారంభమైంది. 'ఏషియన్ సొసైటీ ఆఫ్ ఎక్స్‌పెరిమెంటల్ మెకానిక్స్' (ఏఎస్ఈఎం), 'ఇండియన్ సొసైటీ ఫర్ అప్లైడ్ మెకానిక్స్' (ఐఎస్ఏఎం) సంయుక్త ఆధ్వర్యంలో సదస్సు ఏర్పాటైందని ఐఐటీ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది. ఇస్రో సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ మాజీ డైరెక్టర్, ఆచార్యులు ఎస్.పాండ్యన్ 'డిజైన్ వాలిడేషన్' ప్రాముఖ్యతను వివరించారు. క్లిష్టతరమైన నిర్మాణాలకు సంబంధించిన 'ఇన్‌సిటు మెషర్‌మెంట్స్' అంశంపై సివిల్ ఇంజినీరింగ్ విభాగ ఆచార్యులు శరవణన్ ప్రసంగించారు. సోమవారం జరిగిన సదస్సులో ఐఐటీ డైరెక్టర్ కామకోటి మాట్లాడుతూ.. ఎక్స్‌పెరిమెంటల్ మెకానిక్స్‌లో జాతీయస్థాయి లేబొరేటరీల నుంచి అనుభవజ్ఞులైన నిపుణులు, ఇతర దేశాలకు చెందిన విద్యావేత్తలు సదస్సుకు హాజరవడం ఆనందకరమైన విషయమన్నారు. ఏఎస్ఈఎం అధ్యక్షుడు, ఆచార్యులు యు-లుంగ్ లో, ఐఐటీ అప్లైడ్ మెకానిక్స్ అండ్ బయోమెడికల్ ఇంజినీరింగ్ ఆచార్యులు, సదస్సు ఛైర్ కె. రమేష్, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, జపాన్, వియత్నాం, ఆసియా దేశాలతో పాటు భారత్ నుంచి పలువురు ప్రతినిధులు, ఐఐటీ విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు. సదస్సులో ఐదు ప్లీనరీలు, 75 పరిశోధకపత్రాలు, 40 పోస్టర్లు చోటు చేసుకోనున్నాయి.

దంత వైద్య కళాశాల విస్తరణకు నిధులు

వడపళని, న్యూస్‌టుడే: చెన్నైలోని దంత వైద్య కళాశాల, ఆసుపత్రి విస్తరణకు ప్రభుత్వం రూ.56.5 కోట్ల నిధులు మంజూరు చేసింది. దేశంలోనే చెన్నైలోని దంత కళాశాల పురాతనమైనది. దక్షిణ భారతదేశంలో మొదటి కళాశాల కావడం గమనార్హం. 1953 నుంచి సేవలందిస్తోంది. రోగులు, విద్యార్థులకు ప్రభుత్వం అదనంగా నాలుగు అంతస్తులు నిర్మించేందుకు నిధులు మంజూరు చేసింది. ఒక్కొక్క అంతస్తు 33,600 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం జరగనుందని ప్రభుత్వం సోమవారం ఓ ప్రకటనలో పేర్కొంది.

కోడంబాక్కంలో 'గ్రీన్ దీపావళి' వేడుకలు

వడపళని, న్యూస్‌టుడే: ఎక్స్‌నోరా గ్రేటర్ చెన్నై, కోడంబాక్కం ఎక్స్‌నోరా ఉమెన్స్ గిల్డ్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం 'గ్రీన్ దీపావళి' వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా గిల్డ్ సభ్యులు కోడంబాక్కం ప్రాంతంలో పనిచేసే శుభ్రతా కార్మికులకు కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఎక్స్‌నోరా గ్రేటర్ చెన్నై అధ్యక్షుడు ఆర్.గోవిందరాజ్, ఉమెన్స్ గిల్డ్ అధ్యక్షురాలు ఆర్.మీనాక్షి రామచంద్రన్ తదితరులు హాజరయ్యారు.


శుభ్రతా కార్మికులతో నిర్వాహకులు

దీపావళికి 14,086 ప్రత్యేక బస్సులు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: దీపావళి పండుగకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 14,086 ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు రవాణాశాఖ మంత్రి శివశంకర్ తెలిపారు. ఇందుకు సంబంధించి సోమవారం చెన్నై సచివాలయంలో మంత్రి శివశంకర్ నేతృత్వంలో సమీక్ష జరిగింది. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు చెన్నై నుంచి ప్రతిరోజు నడిచే 2,092 బస్సులతోపాటు 4,900 ప్రత్యేక బస్సులను మూడురోజులపాటు, ఇతర ప్రాంతాల నుంచి మూడురోజులకు 2,910 ప్రత్యేక బస్సులతో కలిపి మొత్తం 14,086 బస్సులు నడుస్తాయని తెలిపారు. పండుగ ముగిసిన తర్వాత ఊర్ల నుంచి చెన్నైకు వచ్చేందుకు నవంబర్ 2 నుంచి 4వ తేదీ వరకు ప్రతిరోజు నడిచే 2,092 బస్సులతోపాటు 3,165 ప్రత్యేక బస్సులు మూడురోజులకు కలిపి 9,441 తిరుగుతాయని, రాష్ట్రంలోని పలు నగరాలకు 3,165 ప్రత్యేక బస్సులతో కలిపి మొత్తం 12,606 బస్సులు నడపనున్నట్లు చెప్పారు. బస్టాండ్లకు వచ్చే ప్రయాణికులు బస్సు, మార్గాల గురించి వివరాలు తెలుసుకునే విధంగా పలుచోట్ల సమాచార కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు రిజర్వేషన్ సౌకర్యాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కిళాంబాక్కం, కోయంబేడు, మాధవరం బస్టాండ్ల నుంచి ప్రత్యేక బస్సులు నడుస్తాయని వివరించారు. ఆమ్నీ బస్సులలో అధిక ఛార్జీలు వసూలు చేయడంపై వాటి యజమానులతో 24వ తేదీ చర్చలు జరుపుతామని తెలిపారు. ఈ ఏడాది 5.50 లక్షల మంది పండుగకు బస్సుల్లో ప్రయాణిస్తారని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మంత్రి శివశంకర్, అధికారులు

ఓటీటీలో 'తంగలాన్' విడుదలకు నిషేధం లేదు

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఓటీటీలో తంగలాన్ సినిమా విడుదలకు ఎలాంటి నిషేధం లేదని మద్రాసు హైకోర్టు తెలిపింది. తిరువళ్లూరుకి చెందిన పోర్కొడి దాఖలు చేసిన ప్రజాప్రయోజన వ్యాజ్యంలో.. పా.రంజిత్ దర్శకత్వంలో విక్రమ్ నటించిన 'తంగలాన్'లో వైష్ణవులను కించపరిచేలా దృశ్యాలు ఉన్నాయన్నారు. బౌద్ధమతాన్ని పవిత్రంగా, వైష్ణవులను హాస్యాస్పదంగా చిత్రీకరించారని, ఇది వరికే థియేటర్లలో విడుదలైందని, త్వరలో ఓటీటీలో రానుందని, అలా వస్తే రెండు వర్గాల మధ్య ఘర్షణ ఏర్పడే అవకాశం ఉందన్నారు. పిటిషన్ చీఫ్ జస్టిస్ కేఆర్ శ్రీరామ్, జస్టిస్ సెందిల్ కుమార్ రామమూర్తి ధర్మాసనంలో విచారణకు వచ్చింది. సినిమా సెన్సార్ సర్టిఫికెట్‌తో థియేటర్లలోకి వచ్చిందని, ఓటీటీలో విడుదలయ్యేందుకు ఎలాంటి నిషేధం లేదని న్యాయమూర్తులు ఉత్తర్వు ఇచ్చారు.

అన్ని కేసులకు సవుక్కు శంకర్ క్రైం బ్రాంచ్‌లో సంతకం చేయాలి

ప్యారిస్, న్యూస్‌టుడే: అన్ని కేసులకు కలిపి సవుక్కు శంకర్ చెన్నై క్రైం బ్రాంచ్‌లో సంతకం చేయాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. చెన్నైకి చెందిన యూట్యూబర్ సవుక్కు శంకర్ మదురై ధర్మాసనంలో దాఖలు చేసిన పిటిషన్‌లో.. మహిళా పోలీసుల గురించి మాట్లాడినందుకు తనపై చెన్నై, తిరుచ్చి, మదురై తదితర జిల్లాల్లో కేసులు నమోదయ్యాయని, గంజాయితో ఉన్నందుకు తేనిలో కేసు నమోదైందని, ఈ కేసుల్లో అరెస్టవగా కోర్టు బెయిల్ మంజూరు చేస్తూ సంబంధిత పోలీస్‌స్టేషన్లలో సంతకం చేయాలని ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్‌కి వెళ్లి సంతకం చేయడం ఇబ్బందిగా ఉందని, అన్ని కేసులకు కలిపి ఒకచోట చేసేలా అనుమతివ్వాలని కోరారు. పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన జస్టిస్ భరతచక్రవర్తి అన్ని కేసులకు చెన్నై క్రైం బ్రాంచ్ పోలీస్‌స్టేషన్‌లో సంతకం చేయాలని, విచారణ జరిగే కోర్టుల్లో హాజరవ్వాని ఉత్తర్వు ఇచ్చారు.

కామరాజర్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

చెన్నై, న్యూస్‌టుడే: మాజీ ముఖ్యమంత్రి కామరాజర్‌పై డీఎంకే విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర విద్యార్థి కాంగ్రెస్ అధ్యక్షుడు చిన్నతంబి ఖండించారు. ఆయన తన ప్రకటనలో.. డీఎంకే యువజన విభాగ కార్యాలయమైన అన్బగంలో జరిగిన ఓ పుస్తకావిష్కరణలో ఆ పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు రాజీవ్‌గాంధీ మాజీ ముఖ్యమంత్రి కామరాజర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కూటమి పార్టీ కాంగ్రెస్ మనోభావాలు దెబ్బతినేలా మాట్లాడటం ఖండించదగిందన్నారు. ఆయన నామ్ తమిళర్ కట్చిలో ఉన్నప్పుడు డీఎంకే అధ్యక్షుడు కరుణానిధిపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, ఆ పార్టీ నుంచి సీమాన్ వెళ్లగొట్టడంతో డీఎంకేలో చేరారని పేర్కొన్నారు. అలాంటి నేపథ్యం కలిగిన రాజీవ్‌గాంధీకి కామరాజర్ గురించి మాట్లాడే అర్హత లేదన్నారు.

దీపావళి ప్రత్యేక రైళ్లు

వడపళని, న్యూస్‌టుడే: దీపావళి రద్దీ దృష్ట్యా కేఎస్సార్ బెంగళూరు - ఎగ్మూరు - కేఎస్సార్ బెంగళూరుకు ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణ రైల్వే సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది.

◗ **06209** కేఎస్సార్ బెంగళూరులో 30, నవంబరు 3 తేదీలు 08.05కు బయలుదేరి అదే రోజు 14.30కి ఎగ్మూరు వస్తుంది. ◗ **06210** ఎగ్మూరులో 30, నవంబరు 3 తేదీలు 15.55కు బయలుదేరి అదేరోజు 22.50 గంటలకు కేఎస్సార్ బెంగళూరు వెళ్తుంది.

● **పొడిగింపు... 06103** తాంబరం - రామనాథపురం ట్రైవీక్లీ నవంబరు 2 నుంచి 30 వరకు (గురు, శని, సోమ), **06104** రామనాథపురం - తాంబరం నవంబరు 3 నుంచి డిసెంబరు 1 వరకు (శుక్ర, ఆది, మంగళ) పొడిగించినట్లు దక్షిణ రైల్వే తెలిపింది. ఈ రైళ్లకు రిజర్వేషన్లు అందుబాటులో ఉన్నాయి.

● **అదనపు బోగీ... 17311, 17312** హుబ్బళి - డాక్టర్ ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ - హుబ్బళి ఎక్స్‌ప్రెస్‌కు ఏసీ త్రీటైర్ ఎకానమీ బోగీ స్థానంలో ఒక జనరల్ రెండో తరగతి బోగీ జత చేస్తున్నారు. హుబ్బళిలో 23, చెన్నై సెంట్రల్‌లో 24 నుంచి నడిచే రైలుకు బోగీ తోడవుతుందని దక్షిణ రైల్వే పేర్కొంది.

వర్ష బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలం: ప్రేమలత

వేలూర్, న్యూస్‌టుడే: ఇటీవల కురిసిన భారీ వర్షాల బాధితులను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత ఆరోపించారు. కృష్ణగిరిలో సోమవారం జరిగిన పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ముందు జాగ్రత్త చర్యలు చేపట్టకపోవడంతో చెన్నైలో ఒకరోజు కురిసిన భారీ వర్షానికి రోడ్లపై మోకాళ్లలోతు నీరు నిలిచిందని, నగరవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి స్టాలిన్ అసమర్థ పాలనకు ఇది నిదర్శనమని దుయ్యబట్టారు. 'తమిళ్ తాయ్ వాళ్తు' గీతం ఆలపించే వ్యవహారంలో రాష్ట్ర సర్కార్ గవర్నర్ ఆర్.ఎన్.రవిని తప్పుబట్టడం సబబు కాదన్నారు. ద్రవిడ అంశంతో డీఎంకే నేతలు రాజకీయ లబ్ధిపొందాలని భావించడం దురదృష్టకరమని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గంజాయి, పొగాకు ఉత్పత్తుల విక్రయాలు మితిమీరాయని, నియంత్రించలేని నేతలు ద్రవిడ సిద్ధాంతాన్ని పట్టుకుని వేలాడుతుండడం సిగ్గుచేటని ధ్వజమెత్తారు. తాము ప్రభుత్వం ఏర్పాటు చేస్తే 3 నెలల్లో నీట్ రద్దు చేస్తామని గొప్పలు పలికిన స్టాలిన్ ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.


కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ప్రేమలత

కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

మహాబలిపురం, న్యూస్‌టుడే: అసెంబ్లీ ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను డీఎంకే ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండు చేస్తూ ఏఐసీటీయూ తరఫున రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని కార్యనిర్వాహక సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. ఏఐసీటీయూ చెన్నై జిల్లా కార్యనిర్వాహక సమావేశాన్ని ఆదివారం సాయంత్రం చెంగల్పట్టు జిల్లా వండలూర్‌లో నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు అబ్రహం నేతృత్వంలో నిర్వహించిన సమావేశంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 24, 25, 26 తేదీల్లో దిల్లీలో నిర్వహించే అఖిల భారత సదస్సును విజయవంతం చేయాలని, నవబర్, డిసెంబరు నెలల్లో కార్మిక వ్యతిరేక మోదీ ప్రభుత్వాన్ని ఖండిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రచారం నిర్వహించాలని, అదేవిధంగా ఎన్నికల సమయంలో కార్మికులకు ఇచ్చిన హామీలను డీఎంకే ప్రభుత్వం నెరవేర్చాలని డిమాండు చేస్తూ ప్రచారం నిర్వహించాలని మొదలైన తీర్మానాలను ఆమోదించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.బాలాజీ, రాష్ట్ర కార్యదర్శి అదియమాన్ తదితరులు పాల్గొన్నారు.

అరుంధతీయుల రిజర్వేషన్‌పై పరస్పర విమర్శలు

సైదాపేట, న్యూస్‌టుడే: వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, కేంద్ర సహాయ మంత్రి ఎల్.మురుగన్ పరస్పరం విమర్శలు గుప్పించుకున్నారు. ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో ఎల్.మురుగన్ మాట్లాడుతూ.. తిరుమావళవన్ అరుంధతీయుల రిజర్వేషన్‌కు సంబంధించి సుప్రీంకోర్టులో కేసు వేశారని, సామాజిక న్యాయంపై మాట్లాడేందుకు అర్హత లేదని తెలిపారు. సోమవారం చెన్నై విమానాశ్రయంలో తిరుమావళవన్ విలేకర్లతో మాట్లాడుతూ.. ఎల్.మురుగన్ అరుంధతీయుడు అని ఆర్ఎస్ఎస్ చెబితేనే తెలిసిందన్నారు. ఆయన అరుంధతీయుల కోసం పోరాడింది కూడా లేదని తెలిపారు. మొదటి నుంచి అరుంధతీయుల రిజర్వేషన్ కోసం పోరాడింది వీసీకే అని చెప్పారు. ఈ విషయమై సోమవారం ఎల్.మురుగన్ స్పందించారు. తిరుమావళవన్ తనను ఆర్ఎస్ఎస్‌కి చెందిన వ్యక్తి అంటున్నారని, అందుకు గర్వపడుతున్నానని తెలిపారు. 2009లో అరుంధతీయుల రిజర్వేషన్ తెచ్చినప్పుడు అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి నేతృత్వంలో అఖిలపక్ష సమావేశం జరిగిందన్నారు. అందులో పాల్గొన్న భాజపా ఉపాధ్యక్షుడు శుభనాగరాజన్ నివేదిక సమర్పించారని అన్నారు. దాంతో పాటు అరుంధతీయులకు ఎందుకు రిజర్వేషన్ అని వివరణ జత చేశారని, అది అప్పట్లో యువ లాయర్‌గా ఉన్న తానే ఇచ్చానని గుర్తు చేశారు.


తిరుమావళవన్, ఎల్.మురుగన్

ల్యాండ్ బ్యాంక్‌కు ఇళ్లను లాక్కోవడం దారుణం: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: సిప్‌కాట్ ల్యాండ్ బ్యాంకు కోసం ఇళ్లను లాక్కోవడం దారుణమని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ తెలిపారు. సోమవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో... భవిష్యత్తులో సిప్‌కాట్ కారిడార్‌ల ఏర్పాటుకు స్థల అవసరానికి ఆవడి వద్ద 626 ఎకరాల భూమిని స్వాధీనం చేసుకునేందుకు సిప్‌కాట్ తీర్మానించిందని తెలిపారు. ఈ పథకం అమలు చేస్తే ఆ ప్రాంతంలో నివసించే 10 వేల కుటుంబాలు రోడ్డునపడే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. ఇది గ్రహించకుండా పారిశ్రామికాభివృద్ధి పేరుతో అమాయకుల నివాస ప్రాంతాలను లాక్కోవడానికి ప్రభుత్వమే యత్నిస్తుండటం దారుణమన్నారు. ఈ నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. నిరుపయోగంగా ఉండే భూములను స్వాధీనం చేసుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులపై దాడి వ్యవహారం

నీట్ శిక్షణ కేంద్రం హాస్టల్‌కు సీలు

టీనగర్, న్యూస్‌టుడే: తిరునెల్వేలి జిల్లాలో చర్చనీయాంశమైన నీట్ శిక్షణ కేంద్రానికి సంబంధించిన హాస్టల్‌కు అధికారులు సోమవారం సీలు వేశారు. శిక్షణ కేంద్రంలో ఉపాధ్యాయుడు కర్రతో దాడి చేసి విద్యార్థులను తీవ్రంగా గాయపరిచిన వీడియోలు సామాజిక మాధ్యమాలలో వైరల్‌గా మారి రాష్ట్రవ్యాప్తంగా కలకలం సృష్టించిన విషయం తెలిసిందే. ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉపాధ్యాయుడు జలాలుద్దీన్ అహ్మద్ కేరళకు పారిపోయినట్లు తెలిసి అతని కోసం పోలీసులు తీవ్రంగా గాలిస్తున్నారు. అదే సమయంలో నెల్లై నగర పోలీసు కమిషనర్ ఉత్తర్వుల మేరకు బాధిత విద్యార్థులు విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు సమన్లు పంపారు. ఈ నేపథ్యంలో హాస్టల్ సరైన అనుమతి లేకుండా నిర్వహిస్తున్నారని తెలియడంతో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ అధికారులు సోమవారం సీలు వేశారు. అందులో ఉన్న విద్యార్థులను వారి సొంతూళ్లకు పంపారు.

వడ్డీ వ్యాపారాలను నియంత్రించాలి: రామదాస్

సైదాపేట, న్యూస్‌టుడే: వడ్డీ వ్యాపారాలకు ప్రభుత్వం సహకరించకూడదని పీఎంకే వ్యవస్థాపకులు రామదాస్ కోరారు. వడ్డీ చెల్లించలేదని వృద్ధురాలిని కొట్టి చంపిన ఘటన తిరునెల్వేలి జిల్లాలో చోటు చేసుకుంది. ఈ ఘటనను రామదాస్ ఖండించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో... ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని తెలిపారు. తమిళనాడులో వడ్డీ హింసలు పెరుగుతున్నాయని, ప్రభుత్వం, పోలీసుశాఖ పట్టించుకోవట్లేదని ఆరోపించారు. తిరునెల్వేలి ఘటన చూస్తుంటే వడ్డీ వ్యాపారానికి ప్రభుత్వమే సహకరిస్తుందేమోనన్న అనుమానం కలుగుతుందని విమర్శించారు. ఇటీవలి కాలంలో ఇలాంటి ఘటనలు పెరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వడ్డీ, చక్ర వడ్డీ నిషేధ చట్టాన్ని అమలు చేయాలని తెలిపారు.

వైభవంగా కుంభాభిషేకం

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై సమీప కొండాముత్తూరులోని పురాతన మత్తువవాళి సమేత నాగేశ్వరుడి ఆలయం ఉంది. శిథిలావస్థకు చేరిన ఆలయంలో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో సోమవారం కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా పవిత్ర జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించి గోపుర కలశాలపై అభిషేకించారు. ముందుగా మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి కళాకారులతో కలిసి సాంప్రదాయ నృత్యం చేశారు. పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేశారు.


నృత్యం చేస్తున్న మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి

కోర్టు ఆదేశాల అమలుకు అధికారులు యత్నించడం లేదు: మదురై ధర్మాసనం

ప్యారిస్, న్యూస్‌టుడే: కోర్టు ఉత్తర్వుల అమలుకు అధికారులు కొంచెం కూడా ప్రయత్నించడం లేదని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది. మదురైకు చెందిన రమేష్ దాఖలు చేసిన పిటిషన్‌లో.. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అధికారులు చర్యలు చేపట్టడం లేదన్నారు. ఈ విషయమై కోర్టుల్లో కేసులు దాఖలవుతున్నాయన్నారు. కోర్టు ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు అమలు చేయడం లేదన్నారు. కోర్టు ధిక్కరణ కేసులు దాఖలైనా పనులు చేపట్టడం లేదని తెలిపారు. పిటిషన్‌పై విచారణ జరిపిన మదురై ధర్మాసనం.. కోర్టు ఆదేశాలు అమలు చేయకూడదని ప్రభుత్వం, అధికారులు విధానంగా మార్చుకున్నారని తెలిపింది. ఇది కోర్టుపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయేలా ఉందని అసంతృప్తి వ్యక్తం చేసింది. పిటిషన్‌పై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ, తమిళనాడు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, తమిళనాడు హోంశాఖ కార్యదర్శి జవాబివ్వాలని ఉత్తర్వు ఇచ్చి విచారణ వాయిదా వేసింది.

చౌక దుకాణాల్లో సరకులు సక్రమంగా అందజేయాలి

మహాబలిపురం, న్యూస్‌టుడే: చౌక దుకాణాల్లో సరకులను సక్రమంగా అందజేయాలని డీఎండీకే నేత విజయ్ ప్రభాకరన్ తెలిపారు. చెంగల్పట్టు జిల్లా తిరుప్పోరూర్ సమీప తైయ్యూర్ ప్రాంతంలో తిరుప్పోరూర్ యూనియన్ తరఫున ముప్పెరుం విళాను ఆదివారం రాత్రి నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయ్ ప్రభాకరన్ పేదలకు సాయం అందజేసి మాట్లాడారు. దీపావళి పండుగ సమీపిస్తున్నందున చౌక దుకాణాల్లో సరకులను సక్రమంగా పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేళంబాక్కం ప్రాంతంలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందని, పరిష్కారించడానికి తగిన చర్యలు చేపట్టాలన్నారు. డీఎంకేలో ఉన్న ఓ కీలక నేత తాను రాజకీయాల్లోకి రానని, తనకు సినిమాలే ముఖ్యమని చెప్పారని, ప్రస్తుతం ఆయన ఉప ముఖ్యమంత్రిగా కొనసాగుతున్నారని పరోక్షంగా ఉదయనిధిని విమర్శించారు. కానీ తనకు తమ పార్టీలో యువజన విభాగ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించారని, ఆ బాధ్యతలను చక్కగా నిర్వర్తిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి అనకై మురుగేశన్, తిరుప్పోరూర్ యూనియన్ కార్యదర్శి కరాటే గోపీనాథ్ తదితరులు పాల్గొన్నారు.


విజయ్ ప్రభాకరన్‌ను సత్కరిస్తున్న పార్టీ నిర్వాహకులు

అలరించిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ - హోమ్ ఎడిషన్


వేదికపై హిప్ హాప్ తమిళ ఆది

చెన్నై, న్యూస్‌టుడే: తమిళ సినీరంగంలో సంగీత దర్శకుడిగా, నిర్మాతగా, రాప్ గాయకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞ ప్రదర్శిస్తున్న హిప్ హాప్ తమిళ ఆది 'రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ - హోమ్ ఎడిషన్' పేరిట చెన్నైలోని వైఎంసీఏ గ్రౌండ్‌లో భారీ సంగీత కార్యక్రమాన్ని నిర్వహించారు. టర్టాయిస్ ఎంటర్‌టైన్‌మెంట్ తరఫున నిర్వహించిన ఈ కార్యక్రమానికి సుమారు 30వేల మంది అభిమానులు హాజరయ్యారు. ప్రేక్షకులందరినీ కలిసే విధంగా డిజైన్ చేసిన వేదిక చివరి భాగం వరకు హిప్ హాప్ తమిళ ఆది వెళ్లి తన పాటలు, డ్యాన్సులతో అభిమానులను ఉర్రూతలూగించారు. ఆయనతో పాటు అభిమానులు శృతి కలిపారు. ఈ కార్యక్రమం దృష్ట్యా చెన్నై మెట్రో రైల్ లిమిటెడ్ రాత్రి సమయంలో అదనంగా గంటపాటు మెట్రో సేవలను పొడిగించింది.


హాజరైన అభిమానులు

చిత్రీకరణ చూసి సినీరంగంలో అడుగుపెట్టా : ఇనియన్ జె.హారిస్



చెన్నై: జోస్ వెంకట్ దర్శకత్వంలో విమల్ నటించి విజయవంతంగా ప్రదర్శితమవుతున్న 'సార్' చిత్రానికి ఛాయాగ్రాహకుడిగా పనిచేసిన ఇనియన్ జె.హారిస్ తన సినీ ప్రస్థానం గురించి వెల్లడించారు. తాను విజయకాంత్‌కు అభిమానినని, ఆయన నటించిన 'పుదు పాడగన్' చిత్రీకరణ కాంచీపురంలోని కామాక్షి అమ్మవారి ఆలయంలో జరిగినప్పుడు చూసేందుకు వెళ్లానని తెలిపారు. అప్పటి నుంచి సినిమాలో పనిచేయాలన్న కోరిక కలిగిందన్నారు. దర్శకుడినవ్వాలని సినిమాకు వచ్చానని, టెక్నికల్‌గా ఏమైనా నేర్చుకోవాలనే ఉద్దేశంతో సినిమాటోగ్రఫీ నేర్చుకుని ఇప్పుడు పూర్తిస్థాయి ఛాయాగ్రాహకుడిగా మారానని తెలిపారు. తనకు నచ్చిన ఛాయాగ్రాహకుడు బాలు మహేంద్ర అన్నారు. గ్రామీణ, చారిత్రక సినిమాలు చేశానని, ఇక ఫ్యాంటసీ చిత్రం చేయాలన్నదే తన కోరిక అని పేర్కొన్నారు. ఎంజీఆర్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్‌లో 2008లో డీఎఫ్‌టీ పూర్తి చేసిన ఇనియన్ జె.హారిస్ 'నాన్ కడవుల్' చిత్రంతో సహాయక దర్శకుడిగా సినీ ప్రస్థానాన్ని ప్రారంభించారు. బాల దర్శకత్వంలోని 'అవన్ ఇవన్', తెలుగులో జూనియర్ ఎన్టీఆర్ నటించిన 'దమ్ము', బాలకృష్ణ 'సింహా', పవన్‌కల్యాణ్ 'గబ్బర్ సింగ్-2' చిత్రాలకు పనిచేశారు. జోస్ వెంకట్ దర్శకత్వంలోని 'కన్ని మాడం' చిత్రం ద్వారా ఛాయాగ్రాహకుడిగా అవతారమెత్తారు. 'యుద్ధ కాండం' చిత్రానికి సింగిల్ షాట్‌లో ఛాయాగ్రహణం చేపట్టి పలువురి దృష్టిని ఆకర్షించారు. ఇప్పటివరకు 15కు పైగా చిత్రాలకు ఛాయాగ్రాహకుడిగా పనిచేశారు.

త్వరలో తుప్పరివాళన్-2 చిత్రీకరణ



చెన్నై: మిష్కిన్ దర్శకత్వంలో 2017లో విడుదలైన చిత్రం 'తుప్పరివాళన్'. డిటెక్టివ్ కథాంశంతో కూడిన ఈ చిత్రంలో విశాల్ ప్రధాన పాత్రలో నటించారు. ప్రేక్షకాదరణ పొందిన ఈ చిత్రానికి రెండో భాగాన్ని నిర్మించనున్నారు. దీనికి విశాల్ దర్శకత్వం వహించి నటించనున్నారు. ఇళయరాజా సంగీతం సమకూర్చనున్నారు. నవంబరులో చిత్రీకరణ ప్రారంభంకానున్నట్లు కోలీవుడ్ సమాచారం. అజర్‌బైజాన్, లండన్ తదితర దేశాల్లో చిత్రీకరణ జరగనుంది. చిత్రంలోని ఇతర నటీనటులు, సాంకేతిక కళాకారుల వివరాలు త్వరలో వెలువడనున్నాయి.



'ఫ్రీడం' పోస్టరు

మరికొన్ని సినీ విశేషాలు

- సత్యశివ దర్శకత్వంలో శశికుమార్, లిజోమోల్ జోస్ జంటగా నటించిన చిత్రం 'ఫ్రీడం'. జిబ్రాన్ సంగీతం సమకూర్చారు. చిత్రం గ్లింప్స్ వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.
- విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి జంటగా నటించిన చిత్రం 'ఎల్ఐకే' (లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ). పోస్ట్ ప్రొడక్షన్ పనులు జరుగుతున్నాయి. చిత్రం తొలి సింగిల్ 'ధీమా' ఇటీవల విడుదలైన నేపథ్యంలో చిత్రీకరణ విధానం, 'బిహైండ్ ది సీన్' వీడియోను చిత్రబృందం విడుదల చేసింది.
- గౌతమ్ వాసుదేవ్ మేనన్ దర్శకత్వంలో శింబు, త్రిష జంటగా 2010లో విడుదలైన చిత్రం 'విణ్ణై తాండి వరువాయా'. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మళ్లీ చెన్నైలోని పీవీఆర్ వీఆర్ మాల్ స్క్రీన్‌పై విడుదలైన ఈ చిత్రం వెయ్యి రోజులు పూర్తి చేసుకుంది. ప్రతి రోజు ఒక షో ప్రదర్శిస్తున్నారు.

పెరుంగళత్తూర్ మార్గంలో వెళ్లొద్దు

దీపావళికి కార్లలో వెళ్లేవారికి పోలీసుల సూచన

ప్యారిస్, న్యూస్‌టుడే: దీపావళికి సొంతూళ్లకు కార్లలో తాంబరం, పెరుంగళత్తూర్ మార్గంలో వెళ్లొద్దని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు. 31న జరుపుకొనే పండుగ దగ్గర పడుతుండటంతో చెన్నైలోని దుకాణ వీధుల్లో జనం రద్దీ పెరిగింది. మరోవైపు చెన్నై నుంచి సొంతూరికి వెళ్లే వారు రైలు, బస్సు టిక్కెట్లు రిజర్వేషన్ చేసుకుంటున్నారు. అవి దొరక్క కార్లలో వెళ్లాలనుకునేవారికి మహానగర పోలీసులు ముఖ్య ప్రకటన విడుదల చేశారు. కారు, ఇతర వాహనాల్లో వెళ్లేవారు తాంబరం, పెరుంగళత్తూర్ మార్గాన్ని ఉపయోగించొద్దని సూచించారు. అందుకు బదులు తిరుప్పోరూర్, చెంగల్పట్టు లేదా వండలూర్ ఔటర్ రింగ్‌రోడ్డులో ప్రయాణించాలని తెలిపారు. తద్వారా ట్రాఫిక్ సమస్య తగ్గుతుందని, ప్రయాణం సులభతరమవుతుందని పేర్కొన్నారు.

జిల్లాస్థాయి అథ్లెటిక్స్ పోటీలు ప్రారంభం


విజేతలకు అభినందనలు తెలుపుతున్న ఎమ్మెల్యే చంద్రన్

తిరుత్తణి, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం తరఫున తిరువళ్లూర్ జిల్లాలో పాఠశాల విద్యార్థులకు అథ్లెటిక్స్ పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. తిరుత్తణిలోని ఓ ప్రైవేటు కళాశాల క్రీడా మైదానంలో జరిగిన తొలిరోజు క్రీడల్లో సుమారు 581 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. పరుగు పందెం, హైజంప్, లాంగ్ జంప్, షాట్‌పుట్ తదితర పోటీలు జరిగాయి. 14, 17, 19 ఏళ్ల విభాగాల్లో విద్యార్థినులు పాల్గొన్నారు. మొదటి మూడు స్థానాల్లో నిలిచినవారికి తిరుత్తణి ఎమ్మెల్యే చంద్రన్ బహుమతులు, పతకాలు, ధ్రువపత్రాలు అందజేశారు.

వేర్పాటువాద రాజకీయాలు విడనాడాలి: భాజపా

సైదాపేట, న్యూస్‌టుడే: వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్, నామ్ తమిళర్ కట్చి సమన్వయకర్త సీమాన్‌లు వేర్పాటువాద రాజకీయాలను విడనాడాలని భాజపా తమిళనాడు విభాగం పేర్కొంది. ఇందుకు సంబంధించి రాష్ట్ర అధికార ప్రతినిధి ఏఎన్ఎస్ ప్రసాద్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్ర ప్రజల సమస్యల పరిష్కారం గురించి ఆలోచించడం మానుకుని కూటమిలో అధికారం, ముఖ్యమంత్రి అవ్వాలనే కల తదితర అభిప్రాయాలను చెప్పడం ద్వారా తాను ఒక ప్రగతిశీల రాజకీయ నాయకుడిని కాదని తిరుమావళవన్ నిరూపించుకున్నారని తెలిపారు. అలాగే జాతి, కుల, మతం బేధం లేకుండా తమిళనాడులో పుట్టి, తమిళం చదివిన వారంతా తమిళులే అనేది సీమాన్ గ్రహించాలన్నారు. అంతకంటే ముందుగా మనమంతా భారతీయులమని తెలుసుకోవాలన్నారు. కొన్ని రోజుల నుంచి ప్రపంచంలోని తమిళులందరినీ కాపాడేందుకు వచ్చినట్లు సీమాన్ నటిస్తున్నారని ఆరోపించారు. సీమాన్, తిరుమావళవన్ ఇద్దరూ వేర్పాటువాద రాజకీయాలు మానుకోవాలని పేర్కొన్నారు.

ఈపీఎస్ ఎలా సీఎం అయ్యారో అందరికీ తెలుసు: ఉదయనిధి

సైదాపేట, న్యూస్‌టుడే: ఎడప్పాడి పళనిసామి ఎలా ముఖ్యమంత్రి అయ్యారో అందరికీ తెలిసిందేనని ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ తెలిపారు. సోమవారం చెన్నై విమానాశ్రయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పదవిపై ఈపీఎస్ వ్యాఖ్యలు ప్రస్తావించగా తనను విమర్శించేందుకు ప్రతిపక్ష నేతకు స్వేచ్ఛ ఉందన్నారు. 2016లో జయలలిత మృతి చెందినప్పుడు తర్వాతి సీఎం ఎవరనే ప్రశ్న వచ్చినప్పుడు సీనియర్లనంతా వెనక్కినెట్టి ఎడప్పాడి పళనిసామి ఆ పదవిని ఎలా దక్కించుకున్నారని ప్రశ్నించారు. ఆయనకంటే సీనియర్లుగా సెంగోట్టయన్, సెమ్మలై, దిండిక్కల్ శీనివాసన్, బన్రుట్టి రామచంద్రన్ ఉన్నారని తెలిపారు. అవతలివారిని విమర్శించే ముందు ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. డీఎంకే అధ్యక్షుడు తనకు ఇచ్చింది పదవి కాదని అదనపు బాధ్యతని తెలిపారు. జయలలిత మృతి చెందిన వెంటనే అధికారాన్ని పంచుకున్నారని పేర్కొన్నారు. అధికారం కోల్పోయిన వెంటనే విడిపోయారని తెలిపారు. పదవులు ముఖ్యం కాదని ప్రజల కోసం పని చేయటమే ప్రధానమన్నారు.



ఆర్కేనగర్: స్మారకస్తూపం వద్ద నివాళులర్పిస్తున్న సీఎం రంగసామి ◗ కాంచీపురంలో ఎస్పీ కె.షణ్ముగం

అమరులారా.. వందనం


వేలూర్‌లో డీఐజీ దేవరాణి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా విధుల్లో మరణించిన పోలీసులకు పుదుచ్చేరి ముఖ్యమంత్రి రంగసామి, మంత్రి నమశ్శివాయం, అధికారులు సోమవారం నివాళులర్పించారు. పుదుచ్చేరిలోని కోరిమేడు పోలీసు మైదానంలో స్మారక స్తూపం వద్ద పుష్పాలు చల్లి అంజలి ఘటించారు. అనంతరం నిర్వహించిన పరేడ్‌ని తిలకించారు. కార్యక్రమంలో డీజీపీ షాలినిసింగ్, ప్రధానకార్యదర్శి శరత్‌సవుఖాన్, ఐజీ అజిత్‌కుమార్ సింగ్లా, డీఐజీ బ్రిజేంద్రకుమార్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అరక్కోణం: రాణిపేట సాయుధ దళ మైదానంలో ఎస్పీ కిరణ్ శృతి నేతృత్వంలో పోలీసు ఉన్నతాధికారులు అమరవీరుల స్మారక స్తూపానికి నివాళులర్పించారు. అదేవిధంగా అరక్కోణం సమీపంలోని తక్కోళం నగిరికుప్పం వద్ద ఉన్న ఎన్డీఆర్ఎఫ్ కేంద్రంలోని స్మారక స్తూపం వద్ద జవాన్లు అంజలి ఘటించారు.

వేలూర్: వేలూర్‌లోని నేతాజీ మైదానంలో వేలూర్ జోన్ డీఐజీ దేవరాణి స్మారక స్తూపం వద్ద పుష్ప వలయాలు ఉంచి అంజలి ఘటించారు. ఎస్పీ మదివాణన్, సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

కాంచీపురం: కాంచీపురం జిల్లా కలెక్టరు కార్యాలయం ప్రాంగణంలో ఉన్న తాత్కాలిక పోలీసు శిక్షణ మైదానంలో ఉన్న స్మారక స్తూపం వద్ద సోమవారం ఉదయం జిల్లా ఎస్పీ కె.షణ్ముగం, ఇతర పోలీసు అధికారులు అంజలి ఘటించారు.


అరక్కోణం: రాణిపేటలో అంజలి ఘటిస్తున్న పోలీసు ఉన్నతాధికారి


కోయంబత్తూరు: కమిషనర్ బాలకృష్ణన్

కోయంబత్తూరు: కోవై సిటీ పోలీసు కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలోని స్మారక స్తూపానికి నగర పోలీసు కమిషనర్ బాలకృష్ణన్ అంజలి ఘటించారు. జిల్లాలోని పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మేళాలో పాల్గొన్న రైతులు

'కేఐటీఎస్'లో రైతు మేళా

వడపళని, న్యూస్‌టుడే: కోయంబత్తూరులోని కారుణ్య ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్సెస్ (కేఐటీఎస్)లో 'ప్రపంచ ఆహార దినం' సందర్భంగా సోమవారం రైతు మేళా ఘనంగా జరిగింది. కోకోనట్ డెవలప్‌మెంట్ బోర్డు ఛైర్మన్ శుభ నాగరాజన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కోయంబత్తూరు, ఈరోడ్ జిల్లాల నుంచి 400 మంది రైతులు పాల్గొని ఉత్పత్తులు, ఆదాయ వనరుల గురించి చర్చించారు. కొబ్బరితో 360 రకాల ఉత్పత్తులు తయారు చేయవచ్చని ఈ సందర్భంగా నాగరాజన్ రైతులకు సూచించారు. రైతులకు ఆర్థిక సాయం, సాంకేతిక పరంగా సలహాలు, పంటల బీమాకు బోర్డు నుంచి సహకారం అందుతుందన్నారు. పంజాబ్ నేషనల్ బ్యాంకు, కెనరా బ్యాంకుల నుంచి సీనియర్ అధికారులు వ్యవసాయదారులకు ఉన్న పథకాల గురించి వివరించారు. కోయంబత్తూరు, ఈరోడ్, తూత్తుకుడికి చెందిన కృషి విజ్ఞాన్ కేంద్రం (కేవీకే) తమ ఉత్పత్తులతో ప్రదర్శన ఏర్పాటు చేసింది.

తమిళ సాహిత్యంపై పోటీ పరీక్షలు


పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్లస్‌వన్ విద్యార్థులకు తమిళ సాహిత్యంపై పోటీ పరీక్షలు 2020 నుంచి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తోంది. ఇందులో ఉత్తీర్ణత సాధించే 1500 మందిని ఎంపిక చేసి ప్రతి నెలా రూ.1500 ఉపకార వేతనాలు అందజేస్తోంది. ఈ ఏడాదికిగాను జిల్లావ్యాప్తంగా 29 కేంద్రాల్లో పోటీ పరీక్షలు సోమవారం నిర్వహించారు. 7,270 మంది హాజరయ్యారు. తిరుత్తణిలోని గెంగుస్వామి మెట్రిక్ మహోన్నత పాఠశాలలో 291 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. వచ్చే నెల ఫలితాలు వెలువడుతాయని విద్యాశాఖాధికారులు తెలిపారు.


కాంచీపురం కుమరకోట్టం మురుగన్ ఆలయంలో వధూవరులకు సారె అందజేస్తున్న కలెక్టరు కలైసెల్వి. చిత్రంలో ఎమ్మెల్యే సీవీఎంపీ ఎళిలరసన్, ఆలయ ఈవో తదితరులు ఉన్నారు.
- కాంచీపురం, న్యూస్‌టుడే

పేద జంటలకు సామూహిక వివాహాలు

కోయంబత్తూరు, న్యూస్‌టుడే: కోవై ఉక్కడంలోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రాష్ట్ర హిందూ దేవాదాయశాఖ ఆధ్వర్యంలో 35 పేద జంటలకు సామూహిక వివాహాలు సోమవారం నిర్వహించారు. ఎంపీ గణపతి రాజ్‌కుమార్ అధ్యక్షత వహించారు. జంటలకు రూ.1.10 లక్షల విలువైన తలా 4 గ్రాముల బంగారు మంగళసూత్రం, 45 రకాల వస్తువులతో సారె అందజేశారు. మేయర్ రంగనాయకి, దేవాదాయశాఖ కమిషనర్ రమేష్ పాల్గొన్నారు.


నూతన జంటలతో ఎంపీ గణపతిరాజ్‌కుమార్ తదితరులు


చిరుధాన్యాల వంటకాలతో తరలివచ్చిన మహిళలు

చిరుధాన్యాల ఆహారోత్సవం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం జిల్లా ఉత్తిరమేరూర్ సమీప మంగళం గ్రామంలో తమిళనాడు మహిళల బృందాలు, కలంజియం మహిళా రైతుల సంఘం సంయుక్తంగా పారంపర్య చిరుధాన్యాల ఆహారోత్సవాని సోమవారం నిర్వహించాయి. మహిళా బృందాలకు చెందిన సుమారు 50 మంది మహిళలు పెసర, రాగులు, సజ్జలు, జొన్నలతో ఆహారాన్ని తయారుచేసి ఊరేగింపుగా తీసుకొచ్చారు. చిరుధాన్యాల ఆహారం భుజిస్తే కలిగే ప్రయోజనాలను నినాదాల రూపంలో వివరించారు.

సముద్రంలో వ్యర్థాలతో జాలర్లకు ఇబ్బందులు

మహాబలిపురం, న్యూస్‌టుడే: చెంగల్పట్టు జిల్లా మహాబలిపురం నుంచి కడలూర్ చిన్నకుప్పం వరకు సముద్రంలో చెత్తతో కూడిన వ్యర్థాలు చేరుతుండటంతో పలు విధాలుగా నష్టపోతున్నట్లు మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీచ్‌కు దాదాపు 3 కి.మీ. దూరం వరకు అనేక రకాల మొక్కలు, ఎన్నో తీగలు కలిసిపోయాయి. మహాబలిపురం, చతురంగపట్నం, కడలూర్ చిన్నకుప్పం ప్రాంతాల్లో వ్యర్థాలు పేరకుపోతున్నాయి. మత్స్యకారులు చేపల వేటకు ఉపయోగించే వలలు వాటిలో ఇరుక్కుపోయి పాడవుతున్నాయిన ఆందోళన చెందుతున్నారు.


చిన్నకుప్పం వద్ద చేపల వేటలో జాలర్లు

శ్రీవారిని దర్శించుకున్న మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: శ్రీవారిని సోమవారం ఉదయం వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వేలుమణి దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.


ఆలయం ఎదుట జస్టిస్ వేలుమణి

వర్ష బాధితులకు ప్రత్యేక శిబిరం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్ళూరు జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతవాసులను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. ప్రస్తుతం వర్షాలు తగ్గడంతో వర్ష బాధితుల సమస్యల పరిష్కారానికి కలెక్టరేట్‌లో సోమవారం ప్రత్యేక శిబిరం నిర్వహించారు. తమ ప్రాంతాల్లో వాననీరు, మురికినీటి కాలువలు నిర్మించాలని కోరుతూ సుమారు 450 మంది కలెక్టర్ ప్రభుశంకర్‌కు వినతులు అందజేశారు. డీఆర్వో రాజ్‌కుమార్, పొన్నేరి ఆర్డీవో వాఘేసంగేత్ బల్వంత్ పాల్గొన్నారు.


వినతులు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రభుశంకర్


కోయంబత్తూరు కారు పేలుడు వ్యవహారం

ముగ్గురి వద్ద ఎన్ఐఏ దర్యాప్తు

ప్యారిస్, న్యూస్‌టుడే: కోయంబత్తూరు కారు పేలుడు వ్యవహారమై ముగ్గురి వద్ద ఎన్ఐఏ అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఉక్కడం కొట్టైమేడులో 2022లో కారు పేలుడు జరిగింది. ఈ వ్యవహారంలో ఇది వరకే 14 మందిని ఎన్ఐఏ అరెస్టు చేసింది. చెన్నై నుంచి కోయంబత్తూరుకి వచ్చిన ఎన్ఐఏ అధికారులు బావాస్ రెహ్మాన్, అబు హనీఫా, చరణ్ మారియప్పన్‌లను సోమవారం కోయంబత్తూరు పోలీసు శిక్షణ పాఠశాలలో దర్యాప్తు చేశారు.


దీపావళి బోనస్ అందజేయాలని కోరుతూ సోమవారం కోవై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న శుభ్రతా కార్మికులు - కోయంబత్తూరు, న్యూస్‌టుడే

ఆవు పొడవడంతో యువకుడి మృతి


రాజదురై (పాతచిత్రం)

వేళచ్చేరి, న్యూస్‌టుడే: విళుపురం జిల్లా మేల్‌మలయనూర్‌కు చెందిన రాజదురై (26) వరికోత యంత్రం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. ఇతనికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ప్రస్తుతం కడలూర్ జిల్లా పల్లవరాయనత్తం ప్రాంతంలో ఉంటూ నెల్లికుప్పం, నడువీరపట్టు పరిసర ప్రాంతాల్లో వరికోత పనులకు వెళ్తున్నాడు. ఇదిలా ఉండగా ఆదివారం రాత్రి ద్విచక్ర వాహనంపై కడలూర్ వైపు వెళుతుండగా నెల్లికుప్పం సమీప కీళ్అరుంగుణం వద్ద రోడ్డుకు అడ్డంగా ఆవు వచ్చింది. వెంటనే వాహనాన్ని ఆపిన రాజదురై కడుపులో పొడవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతిచెందాడు. నెల్లికుప్పం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి దర్యాప్తు జరుపుతున్నారు.

మోసానికి పాల్పడిన బ్యాంకు మేనేజరు అరెస్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ప్రైవేటు బ్యాంకులో తాకట్టు పెట్టిన బంగారు నగలను మార్చేసి మోసానికి పాల్పడిన బ్యాంకు మేనేజరు, మరో ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశారు. పోలీసులవివరాల మేరకు.. శివగంగై జిల్లా కారైక్కుడి వద్ద ఉన్న కల్లల్ ప్రాంతంలో ప్రైవేటు బ్యాంకు ఉంది. అందులోని నగలను అధికారులు పరిశీలించగా అవి కవరింగ్‌గా తెలిసింది. వినియోగదారులు తాకట్టు పెట్టిన నగలకు బదులుగా నకిలీవి పెట్టినట్లు గుర్తించారు. మేనేజరు, మరికొందరు మోసానికి పాల్పడినట్లు తెలిసింది. రూ.2 కోట్లు విలువైన 533 సవర్ల నగలను నకిలీవిగా మార్చినట్లు గుర్తించారు. శివగంగై క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేసి ఆదివారం బ్రాంచి మేనేజరు విఘ్నేష్, అసిస్టెంట్ మేనేజరు రాజాత్తి, వారికి సాయపడిన రమేష్, సతీష్‌ను అరెస్టు చేశారు.

పోలీసునని చెప్పి మోసగించిన వ్యక్తి...


కన్నదాసన్

రెడ్‌హిల్స్: తిరువళ్లూరు సమీప దావూద్‌ఖాన్‌పేటకు చెందిన జయంతి కిరాణా దుకాణం నిర్వహిస్తోంది. ఈమె రెండు రోజుల క్రితం దుకాణంలో ఉండగా ఓ వ్యక్తి అక్కడకు వచ్చి తాను పోలీసు కానిస్టేబుల్‌నని పరిచయం చేసుకున్నాడు. దుకాణంలో నిషేధిత పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు తనిఖీ చేసేందుకు వచ్చినట్లు పేర్కొన్నాడు. రూ.లక్ష ఇస్తే తనిఖీ చేయకుండా వెళ్లిపోతానని చెప్పడంతో నిజమని నమ్మిన ఆమె రూ.50 వేలు ఇచ్చింది. అతను వెళ్లిపోయిన తర్వాత జయంతి తిరువళ్లూరు పట్టణ పోలీసుస్టేషన్‌కు వెళ్లగా నగదు తీసుకున్న వ్యక్తి నకిలీ పోలీసుగా తెలిసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టి అరణ్‌వాయల్ కాలనీకి చెందిన కన్నదాసన్ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రూ.50 వేలను స్వాధీనం చేసుకున్నారు.

పుట్టగొడుగుల కూర తిన్న ఐదుగురికి అస్వస్థత

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప పుట్లూర్ కోఆప్‌టెక్స్ నగర్‌కు చెందిన లక్ష్మి తన ఇంటి ఎదురుగా మొలిచిన పుట్టగొడుగులతో సోమవారం కూర వండింది. బంధువులు శాంతి, అలమేలు, శరణ్య, వెంకటేశన్‌కు వడ్డించి తానూ తినింది. కొద్ది సేపటికి ఐదుగురికి వాంతులు, విరేచనాలై స్పృహకోల్పోవడంతో ఇరుగుపొరుగువారు తిరువళ్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ నుంచి చెన్నై జీహెచ్‌కు తీసుకెళ్లారు.